సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



రిఫర్ చేసేయ్...!

ఉత్తరాంధ్రలో అతి పెద్ద మాత, శిశు ఆస్పత్రి అయిన ఘోషా ఆస్పత్రిలో సమస్యలు కొలువుదీరాయి.

- 8లో



'కళా'కు కోడ్ వర్తించదా..!

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ప్రభుత్వం తరఫున జరిగే కార్యక్రమాల్లో పాలకులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది.

- 8లో



పండగెళ్లిపోయింది.. జరగని రోడ్డు పనులు రద్దవుతున్నాయి...!

సంక్రాంతి వెళ్లిపోయింది. రోడ్ల పనులను కూటమి ప్రభుత్వం రద్దుచేసి.. ప్రజలకు ఆవేదన మిగుల్చుతోంది.

- 8లో

న్యూస్‌రీల్

రోడ్డుపై పీడీఎస్ బియ్యం



ఏబీ రోడ్డుపై రాత్రి పడిన సుమారు 50 బియ్యం బస్తాలు

భామిని: దిమ్మిడిజోల–అనంతగిరి మధ్యన రోడ్డుపై శుక్రవారం రాత్రి భామిని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బియ్యం తరలిస్తున్న లారీ నుంచి 50 బస్తాలు కిందపడ్డాయి. లారీ డ్రైవర్ గుర్తించకుండా ముందుకెళ్లిపోయాడు. వెనుకనే వస్తున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు బియ్యంను గుర్తించి అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే ఎఫ్‌సీఐ సిబ్బంది లారీ డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో దిమ్మిడిజోల ఆవల నిలిపి రోడ్డుపై పడిన బియ్యంను మళ్లీ లోడ్‌చేశారు. ఎఫ్‌సీఐ కళాసీలు నిర్లక్ష్యంగా కట్టు కట్టడం వల్లే బియ్యం బస్తాలు రోడ్డుపై పడినట్టు డ్రైవర్ పేర్కొన్నాడు.

11, 12 తేదీల్లో మన్యం బంద్

- జయప్రదం చేయాలని పిలుపు

పార్వతీపురంటౌన్: గిరిజనుల హక్కులను హరించేలా అమలుచేస్తున్న ప్రభుత్వ విధానాలు, స్పీకర్ వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 11, 12 తేదీల్లో తలపెట్టిన మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ కుమార్ గిరిజనులకు పిలుపునిచ్చారు. పార్వతీపురం సుందరయ్య భవనంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదవ షెడ్యూల్‌లో నివసిస్తున్న ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి 1/70 చట్టమే ఆటంకమని, వాటికి సవరణ చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అనంతరం బంద్ రోజున బస్సులు నిలిపివేయాలని కోరుతూ పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా నాయకులు మండంగి రమణ, రామారావు, కె.సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు

ఆదివాసీ గిరిజన సంఘాల మన్యం బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఏజెన్సీని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే విధానాలను విడనాడాలన్నారు. గిరిజనులు పోరాడి సంపాదించుకున్న హక్కులను కాలరాయడం సరికాదన్నారు.

డీ వార్మింగ్‌డేను జయప్రదం చేద్దాం

- 3,845 కేంద్రాల నుంచి 1,96,612 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



డీవార్మింగ్ డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, వైద్యులు

పార్వతీపురంటౌన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన (డీ వార్మింగ్ డే) దినాన్ని జయప్రదం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పిలుపునిచ్చారు. వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్స్‌కు శనివారం జూమ్ కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవార్మింగ్ డేలో ఏడాది నుంచి 19 సంవత్సరాల విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు బాగా నమిలి మింగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తర్వాత మాత్రలు వేయించాలన్నారు. ఆ సమయంలో స్వచ్ఛమైన తాగునీరు సిద్ధం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,96,612 మంది పిల్లలు, విద్యార్థులకు 3,845 కేంద్రాల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఏడాది నుంచి ఐదేళ్ల లోపు వయస్సుగల 55,234 మంది పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోను, 5 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల 1,41,378 మంది విద్యార్థులకు పాఠశాల, కళాశాలల్లో మాత్రలు వేయిస్తారన్నారు. నులిపురుగులు సంక్రమణ వల్ల రక్తహీనత, పోషకార లోపం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, నీరసం వంటి అనారోగ్య సమస్యలను పిల్లలు ఎదుర్కొంటారన్నారు. ఏవైనా కారణాలతో ఆ రోజు ఆల్బెండజోల్ మాత్ర వేయని వారికి 17వ తేదీన నిర్వహించే మాపప్ కార్యక్రమంలో పూర్తి చేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఐఓ నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు కె.విజయపార్వతి, కేవీఎస్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహన్‌రావు, పి.ఎల్.రఘుకుమార్, ఎం.వినోద్, శ్రీధర్, డీఎస్ఓ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మక్కువ మండలం నంద వారపు సంతలో వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్





లొద్ద జలపాత అందాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మన్యం అందాలకు కలెక్టర్ ఫిదా

- జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తా
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



గిరిజన మహిళలతో కలెక్టర్ ముచ్చట



లొద్ద జలపాతం అందాలను ఆస్వాదిస్తూ...

సాలూరురూరల్/మక్కువ/సాలూరు: మన్యం అందాలకు కలెక్టర్ ఫిదా అయ్యారు. జలపాతాలను చూసి మురిసిపోయారు. గిరిజన సంతలు, సంస్కృతి, సంప్రదాయాలకు ఆకర్షితులయ్యారు. మన్యంలో పర్యాటకాభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. సాలూరు–మక్కువ మండలాల మధ్యన ఉన్న లొద్ద జలపాతాన్ని ఆయన శనివారం సందర్శించారు. ప్రకృతి అందాలను తన సెల్‌ఫోన్‌లో క్లిక్ మనిపించారు. మక్కువ మండలం నంద వారపు సంతలో గిరిజన ఉత్పత్తుల విక్రయాన్ని పరిశీలించారు. పంటలకు ఏ మేరకు గిట్టుబాటు ధర వస్తుందో అడిగి తెలుసుకున్నారు. సాలూరు మండలం కొదమ పంచాయతీ లొద్ద జలపాతానికి చేరుకుని ఆహ్లాదకర వాతావరణాన్ని కాసేపు ఆస్వాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో శ్రమించి కాలినడకన లొద్ద జలపాతానికి చేరుకున్నానని, జలపాతం, పరిసర ప్రాంతాలను చూశాక కష్టమంతా మర్చిపోయానన్నారు. కొండల మధ్యన ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూపించాలన్నారు. గిరిజనులు అమాయకులని, వారి జీవన శైలి అందంగా ఉందన్నారు. వారి వస్త్రధారణ అసాధారణమని పేర్కొన్నారు. వారు తీసుకునే ఆహారం, పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. వారికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందని, దానికి అనుగుణంగా రాబోయో రోజుల్లో చర్యలు చేపడతామన్నారు. పండించిన కొద్దిపాటి పంటను సంతల్లో విక్రయించి ఆ వచ్చిన కొద్దిపాటి సంపాదనతోనే జీవనాన్ని కొనసాగించడం గమనించాన్నారు. వారి ఆదాయ వనరులు పెంపొందించే దిశగా అడుగులు వేయాల్సి ఉందన్నారు. ఏజన్సీ వాతావరణం ఆహ్లాదకరం, ఆరోగ్యకరమని పేర్కొన్నారు. వెళ్లేందుకు కష్టతరమైనా లొద్ద వద్ద ఉన్న జలపాతం చూడదగ్గదని కితాబిచ్చారు. జిల్లాలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు వస్తున్న పర్యాటకులు కొందరు భోజనం తిన్నాక ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడికక్కడే వదిలేయడం గుర్తించామని, పర్యాటకులు పరిశుభ్రత పాటించాలన్నారు. పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ప్రత్యేక బృందాన్ని నియమిస్తానన్నారు. కాఫీ తోటల సాగుకు పాచిపెంట మండలం శతాబి పరిసర ప్రాంతాలు అనుకూలమన్నారు. సాగుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. కలెక్టర్ వెంట స్థానిక గిరిజన యువత ఉన్నారు.

తైక్వాండో పోలీస్



జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కానిస్టేబుల్ అరుణ్ (ఫైల్)



అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎస్పీ మాధవ్ రెడ్డి (ఫైల్)

పార్వతీపురంటౌన్: ఆయన ఓ వైపు బాధ్యతాయుతమైన కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే.. మరోవైపు తైక్వాండో క్రీడలో కఠోర సాధన చేస్తూ పతకాల పంట పండిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ తైక్వాండో పోలీస్‌గా పేరు సాధించారు. ఆయనే పార్వతీపురం పట్టణం ఇందిరా కాలనీకి చెందిన కోల అరుణ్‌కుమార్. ఆయన విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి తైక్వాండోపై మక్కువతో 2003వ సంవత్సరంలో శిక్షణలో చేరారు. 2008 వరకు పట్టణంలో తైక్వాండో శిక్షణ పొంది పోటీలకు అర్హత సాధిందించారు. 2013లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరినా క్రీడా సాధన ఆపలేదు. ఇప్పుడు ఆ సాధనే పతకాలను తెచ్చిపెడుతోంది. పోలీస్ అధికారుల నుంచి ప్రశంసలు అందేలా చేస్తోంది. జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా పోలీస్ కంట్రోల్ బోర్డులో పలు విభాగాల్లో పతకాలు సాధించడంతో ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆయనను ఇటీవల అభినందించారు. రానున్న రోజుల్లో మరింత ప్రతిభ కనబరచి జిల్లా పోలీసు శాఖకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కానిస్టేబుల్ అరుణ్ సాధించిన పతకాలు..

- 2016 సంవత్సరంలో బెంగుళూరులో జరిగిన రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌లో బంగారు పతకం
- 2017 హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్
- 2018లో తైక్వాండో గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్
- 2016లో 74 కేజీల విభాగంలో ఏపీ పోలీస్ తైక్వాండో పోటీల్లో సిల్వర్ మెడల్
- 2022లో ఆల్ ఇండియా పోలీస్ జూడో కౌన్సిల్‌లో జాతీయ స్థాయి బంగారు పతకం
- 2023 పోలీస్‌జూడో కౌన్సిల్‌లో బంగారు పతకం
- 2024 పోలీస్ జూడో కౌన్సిల్ వెండి పతకం సాధించారు.

అంతర్జాతీయ పోటీల్లో రాణించడమే లక్ష్యం



అంతర్జాతీయ స్థాయి పోటీలో తలపడి పతకం సాధించడమే లక్ష్యం. విధి నిర్వహణ అనంతరం ఖాళీ సమయాల్లో ఆసక్తిగల విద్యార్థులకు తైక్వాండోలో శిక్షణ ఇస్తున్నాను. వారిని కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తలపడేలా తర్ఫీదునిస్తున్నాను. పోలీస్ అధికారుల ప్రోత్సాహం ఎనలేనిది. పతకాల సాధన వెనుక కఠోర సాధన ఉంది.

– అరుణ్‌కుమార్, ఏఆర్ కానిస్టేబుల్, పార్వతీపురం

నివాసం ఓ చోట.. కొలువు మరోచోట

- ఓ టీచర్ నిర్వాకం

సీతానగరం: ఓ టీచర్ జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో నివాసం ఉంటూ బాడంగి కేజీబీవీ విద్యాలయంలో పనిచేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గజపతినగరానికి చెందిన వజ్రపు గుణలక్ష్మి అవుట్ సోర్సింగ్ విధానంలో పీజీటీ మ్యాథ్స్ టీచర్‌గా జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో 11 ఏళ్ల పాటు పనిచేశారు. అప్పటి నుంచి స్థానికంగా ఉన్న క్వార్టర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. రెండు నెలలుగా బాడంగి కేజీబీవీలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా చేరారు. ఆమె కుటుంబం మాత్రం జోగింపేట గిరిజన ప్రతిభ విద్యాలయం క్వార్టర్‌లోనే నివసిస్తోంది. ఇదే విషయాన్ని ప్రతిభ విద్యాలయం ప్రిన్సిపాల్ ధర్మరాజు వద్ద ప్రస్తావించగా రెండు నెలలుగా విధులకు హాజరుకాని గుణలక్ష్మి పేరును రిజిస్టర్ నుంచి తొలగించామన్నారు. క్వార్టర్‌ను సైతం ఖాళీ చేయాలని సూచించామన్నారు. త్వరలో ఖాళీ చేస్తానని ఆమె చెప్పినట్టు తెలిపారు.

కొనసాగుతున్న నిరవధిక దీక్ష



కళాశాల ఆవరణలో నిరవధిక దీక్ష చేస్తున్న వెటర్నరీ కళాశాల విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): మండలంలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలకు వీసీఐ గుర్తింపును తీసుకురావాలని, స్టైఫండ్‌ను రూ.25వేలకు పెంచాలనే డిమాండ్లతో కళాశాల ఆవరణలో వెటర్నరీ విద్యార్థులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శనివారం ఆరవ రోజు కొనసాగింది. కళాశాలలో చదువుతున్న ఐదు బ్యాచ్‌లకు చెందిన 327 మంది విద్యార్థులు దీక్షలో పాల్గొన్నారు. డిమాండ్లు సాధించేవరకు పోరాటం ఆగదని స్పష్టంచేశారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు



కన్నులపండువగా వేంకటేశుని కల్యాణం



ఎదురు సన్నాహోత్సవ పూజలో పాల్గొన్న ఈఓ సూర్యనారాయణ



మంగళ సూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకులు

గరుగుబిల్లి: పవిత్ర నాగావళి నదీ తీరాన స్వయంభూగా వెలసిన తోటపల్లి వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం కన్నులపండువగా సాగింది. సాయంత్రం 6 గంటలకు మంగళవాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ పద్మావతి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేదమంత్రాలతో అర్చకులు జరిపించారు. ఏటా మాఘశుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, ధ్వజారోహణం, వాస్తు–యోగీశ్వరహోమం, విశేషహోమం, శాత్తుమురై తదితర పూజలు నిర్వహించిన అనంతరం ఎదురు సన్నాహోత్సవం, తిరువీధి మహోత్సవం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడవగంటి వెంకటనరసింహచార్యులు, తిరుమల తిరుపతి దేవస్థాన వేద పండితులు జగన్నాథశాస్త్రి పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు వి.వి.అప్పలాచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణఘట్టాన్ని జరిపించారు. కల్యాణంలో పాల్గొనే భక్తులకు కంకణాలు, స్వామివారి పూజసామగ్రిని అర్చకులు అందజేశారు. పార్వతీపురం, గరుగుబిల్లి, కురుపాం, సాలూరు, వీరఘట్టం, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాన్ని తిలకించారు. అమ్మవారికి మంగళసూత్రాలను రాజాంనకు చెందిన కాల్దారి వెంకట శివప్రసాద్ దంపతులు సమకూర్చారు. కల్యాణోత్సవంలో భాగంగా ఏర్పాటుచేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈఓ వి.సూర్యనారాయణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

కల్లుగీత సామాజిక వర్గాల మద్యం దుకాణాలకు...

పోటాపోటీ

- విజయనగరం జిల్లాలో 16 షాపులకు 308 దరఖాస్తులు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 4 షాపులకు 60 దరఖాస్తులు
- రేపు కలెక్టరేట్‌లో లాటరీ విధానంలో కేటాయింపు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉభయ జిల్లాల్లో కల్లుగీత సామాజిక వర్గాలకు కేటాయించిన 20 మద్యం దుకాణాలకు గట్టి పోటీ నెలకొంది. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత ఇప్పటికే విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించింది. వాటిలో ఎక్కువగా టీడీపీ నాయకులకు, వారి కనుసన్నల్లో పనిచేసే సిండికేట్‌లకే దక్కాయి. ఇప్పుడు వాటికి అదనంగా మరో 20 మద్యం దుకాణాలను కల్లుగీత సామాజిక వర్గాలకు కేటాయించింది. శనివారం గడువు ముగిసే సమయానికి విజయనగరం జిల్లాలో నోటిఫికేషన్ ఇచ్చిన 16 షాపులకు 308 దరఖాస్తులు వచ్చాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు షాపులకు 60 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 10వ తేదీన ఆయా జిల్లాల కలెక్టర్ల సమక్షంలో లాటరీ తీసి షాపులను కేటాయిస్తామని విజయనగరం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి బి.శ్రీనాథుడు తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఆడిటోరియం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉదయం 9 గంటలకు లాటరీ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో మద్యం దుకాణాన్ని దక్కించుకున్నవారు లైసెన్స్ ఫీజు (2024–25 సంవత్సరానికి రిటైల్ ఎక్సైజ్ టాక్స్) కింద రూ. 21,66,667 చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. తదుపరి సంవత్సరం (2025–26) లైసెన్స్ ఫీజు రూ.35.75 లక్షలు చెల్లించాలి. ఇలా లైసెన్స్ ఫీజు సగానికి రాయితీ ఇవ్వడంతో పోటీ ఎక్కువైంది. అయితే, ఆయా సామాజిక వర్గాల్లో సామాన్యుల కన్నా ఇక్కడా సిండికేట్ చక్రం తిప్పుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సేవ చేయడం మన సంస్కృతి

- మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
- గ్రామీణ ప్రాంతంలో క్యాన్సర్ ఆస్పత్రిని నిర్వహించడం గొప్ప విషయం



దివ్యాంగులకు ఉపకరణాలను అందజేస్తున్న వెంకయ్యనాయుడు

కొత్తవలస: ఇతరులకు సేవ చేయడం, కష్టసుఖాలను పంచుకోవడం మన భారతీయ సంస్కృతిలోనే ఉందని, ప్రతీ ఒక్కరి జీవితంలో సేవ ఒక భాగం కావాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామ సమీపంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు 27వ వార్షికోత్సవానికి ఆయన శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రస్టు సేవలను ప్రశంసించారు. ఒక మారుమూల ప్రాంతంలో పల్లె ప్రజలకు ఇటువంటి సేవా కార్యక్రమాలను అందిస్తున్న జగదీష్‌బాబును అభినందించారు. సర్వేజనా సఖినోభవంతు అన్నది మన మౌలిక సూత్రమన్నారు. నష్టపోయినవారిని, సమాజంలో అట్టడుగున దయనీయ స్థితిలో ఉన్నవారిని, ఆపదలో ఉన్నవారిని, అన్యాయానికి గురైన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్యనేర్పిన గురువులకు, సమాజానికి ఎల్లప్పుడూ కృతజ్ఞులై ఉండాలన్నారు. ప్రకృతితో జీవించడం నేర్చుకోవాలన్నారు. పిల్లలకు సెల్‌ఫోన్ అలవాటు చేయరాదన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లా డుతూ ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో ఆరోగ్యమే మహాభాగ్యమని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఉత్తరాంధ్రలో క్యాన్సర్ వ్యాధి పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళలు తమ ఆరోగ్య స్థితిగతులను ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అతిపెద్ద క్యాన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం ఈ ప్రాంతానికి పెద్ద వరమన్నారు. ముందుగా పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీచేశారు. అనంతరం చింతలపాలెం గ్రామంలో చిట్టిపాప తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన సాహిత్యగోష్ఠిలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో రూ.2.30లక్షల ఆస్తి నష్టం



స్క్రాప్ షాపులో మంటలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలోని స్క్రాప్ దుకాణంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.2.30 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి జి.ప్రభాకరరావు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి 12 గంటల వరకు తమ సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారన్నారు. సకాలంలో స్పందించడం వలన రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం జరగకుండా కాపాడామన్నారు. బొబ్బిలి, పార్వతీపురం నుంచి రెండు ఫైర్ ఇంజిన్లు ఆరు ట్రిప్పులతో మంటలను అదుపులోకి తెచ్చినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

విజయనగరం క్రైమ్: విశాఖ వెళ్లి వస్తానని చెప్పిన యువతి కనపడకుండా పోయినట్టు బాధిత కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. గరివిడికి చెందిన ఓ యువతి గతేడాది నవంబరు 9న ఇంటి నుంచి బయలుదేరి విజయనగరం వచ్చి, అక్కడ పని ముగించుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విశాఖ వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదని, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అన్ని చోట్లా వెతికినప్పటికీ ఎటువంటి ఫలితం లేదన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

బెల్టు దుకాణాలపై దాడులు

చీపురుపల్లి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చీపురుపల్లి సర్కిల్ పరిధిలో బెల్టు దుకాణాలపై విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చక్రవర్తి తెలిపారు. శనివారం సర్కిల్ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌తో బాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్‌టీఎఫ్ విభాగాలు నిర్వహించిన దాడుల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడు మండలాల్లో గతంలో బెల్టు దుకాణాలు నిర్వహించిన కొంత మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు



చికిత్స పొందుతున్న మేఘసాయి

బొబ్బిలి: పట్టణంలోని పాతబొబ్బిలి సమీపంలో ఉన్న గుంతల వద్ద ముందు వెళ్తున్న ఆటోను ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు గాయాల పాలయ్యారు. స్థానిక సత్యసాయి జూనియర్ కాలేజ్‌లో చదువుతున్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం కాశియ్యపేటకు చెందిన మడక మేఘసాయి, అదే మండలం అంటిపేటకు చెందిన దిలీప్‌కుమార్ వారి స్వగ్రామాలకు బైక్‌పై శనివారం వెళ్తున్నారు. పాత బొబ్బిలి సమీపంలో గుంతల వద్ద వీరికన్నా ముందు వెళ్తున్న ఆటోను ఢీకొన్నారు. దీంతో కిందపడి గాయపడ్డ వీరిని స్థానిక సీహెచ్‌సీలో చేర్పించారు. విద్యార్థులు చికిత్స పొందుతున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు దాసరి శంకరరావు

పాచిపెంట : మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య పాల్పడిన సంఘటన మండలంలోని కర్రివలసలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్రివలస గ్రామానికి చెందిన దాసరి శంకరరావు (34) శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో తగాదా పడ్డాడు. భార్య మందలించడంతో మద్యం మత్తులో మనస్తాపానికి గురై గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ కృష్ణారావు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

✦ గరివిడి మండలానికి చెందిన సింహాద్రమ్మ అనే గర్భిణి కొద్ది రోజుల కిందట ఘోషా ఆస్పత్రిలో ప్రసవించింది. ఆమెకు మగ బిడ్డ జన్మించాడు. బరువు తక్కువతో శిశువు జన్మించాడని కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. దీంతో 108 నియోనేటల్ అంబులెన్సులో కేజీహెచ్‌కు తరలించారు.

✦ రామభద్రపురం మండలానికి చెందిన జి.పార్వతి అనే గర్భిణి ఘోషా ఆస్పత్రిలో ప్రసవించింది. ఈమెకు మగబిడ్డ జన్మించాడు. శ్వాసకోశ సమస్య ఉందని శిశువును కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు 108 నియోనేటల్ అంబులెన్సులో కేజీహెచ్‌కు తరలించారు.

✦ గంట్యాడ మండలానికి చెందిన పి.జ్యోతి అనే గర్భిణి కొద్ది రోజులు కిందట ఘోషా ఆస్పత్రిలో ప్రసవించింది. ఈమెకు మగ బిడ్డ జన్మించాడు. శ్వాసకోశ సమస్య ఉందని శిశువును వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో శిశువు మృతి చెందాడు.

- ఘోషా ఆస్పత్రిలో సమస్యల కొలువు..!
- ఆస్పత్రిలో పారిశుధ్య లోపం
- అవస్థలు పడుతున్న రోగులు
- నవజాత శిశువులు, పిల్లలను కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు
- మార్గంలోనే మృత్యువాత పడుతున్న శిశువులు
- 180 నుంచి 200 వరకు రోజువారీ ఓపీ



ఘోషా ఆస్పత్రి

రిఫర్ చేసేయ్...!

విజయనగరం ఫోర్ట్: ఉత్తరాంధ్రలో అతి పెద్ద మాత, శిశు ఆస్పత్రి అయిన ఘోషా ఆస్పత్రిలో సమస్యలు కొలువుదీరాయి. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందే గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, పిల్లలు అవస్థలు పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిలో ఎస్ఎన్‌సీయూ (నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ కేంద్రం) ఉంది. నవజాత శిశువులకు చికిత్స అందించడానికి అవసరమైన పరికరాలు, ఆక్సిజన్, వెంటిలేటర్స్ ఉన్నప్పటికీ కేజీహెచ్‌కు శిశువులను రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గర్భిణులను కూడా కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కేజీహెచ్‌కు శిశువులను తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యలో కొందరు, చికిత్స పొందుతూ మరి కొందరు మృత్యువాత పడుతున్నారు.



పనిచేయని సోలార్ హీటర్స్



ఎస్ఎన్‌సీయూ విభాగం

ఆస్పత్రిలో పారిశుధ్య లోపం

ఆస్పత్రిలో పారిశుధ్య లోపం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య చర్యలు సక్రమంగా చేపట్టకపోవడం వల్ల దుర్వాసన వస్తున్నట్టు రోగులు చెబుతున్నారు. మాత, శిశువులకు సంబంధించిన ఆస్పత్రి కాబట్టి నిరంతరం ఆస్పత్రిని క్లీన్ చేయాల్సి ఉంది. కానీ ఆ విధంగా చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేడి నీళ్లు బయట కొనుగోలు చేయాల్సిన దుస్థితి

ఆస్పత్రిలో 2500 లీటర్ల సామర్థ్యం గల సోలార్ హీటర్లు ఉన్నాయి. అవి గత కొంత కాలంగా పని చేయడం లేదు. దీంతో వేడి నీళ్లు రావడం లేదు. వేడి నీళ్లను గర్భిణులు, బాలింతల బంధువులు ప్రైవేటు టీస్టాల్స్ వద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. బాటిల్ వేడి నీళ్లు రూ.20 చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

నిత్యం అధిక సంఖ్యలో..

ఆస్పత్రికి నిత్యం అధిక సంఖ్యలో రోగులు వస్తారు. 180 నుంచి 200 వరకు రోగులు ఆస్పత్రికి వస్తారు. వీరిలో గైనిక్ సంబంధిత సమస్యలతో వచ్చే వారు 30 నుంచి 40 మంది వరకు ఉన్నారు. గర్భిణులు, పిల్లలు 160 నుంచి 170 మంది వరకు ఉంటున్నారు. ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఆస్పత్రిలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మరో రెండు ఫ్లోర్‌లు ఉన్నాయి. లిఫ్ట్ లేక పోవడం వల్ల మెట్లుపై నుంచి వెళ్లాల్సి రావడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అత్యవసరం అయితేనే..



గర్భిణులను, నవజాత శిశువులను అత్యవసరం అయితేనే రిఫర్ చేయాలి. ఇక్కడ చికిత్స అందించే అవకాశం ఉన్నప్పటికీ రిఫర్ చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుంది. లిఫ్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఇతర సమస్యలు పరిష్కరానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. – డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ఘోషా ఆస్పత్రి

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం : ఎస్పీ



ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: మత్తు, మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందల్ శనివారం ఒక ప్రకటనలో యువతకు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను వివరించి, వాటి పట్ల ఆకర్షితులు కాకుండా తమ శాఖ ద్వారా తగు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పలు ఇంజినీరింగ్, మెడికల్, ప్రభుత్వ, ప్రైవేటు, డిగ్రీ జూనియర్ కళాశాలలను సందర్శించి, సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్, లఘుచిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా, రవాణా చేసినా, చట్ట రీత్యా తీవ్ర నేరంగానే పరిగణిస్తామని, వాటికి చాలా కఠినంగా శిక్షలు ఉంటాయని ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు.

జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులతో ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణ

విజయనగరం అర్బన్: జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం తాత్కాలిక కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఏపీఎన్‌జీఓ హోమ్‌లో శనివారం జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఈ మేరకు తాత్కాలిక కమిటీ ఏర్పాటు ప్రక్రియ చేపట్టారు. జిల్లా అధ్యక్షునిగా వై.రమణ, కార్యదర్శిగా పి.పార్థసారధి రావు, అసోసియేట్ అధ్యక్షులుగా జి.రఘుబాబు, కోశాధికారిగా టి.వెంకటరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సీహెచ్ సంతోషకుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.జగదీష్, జి.కృష్ణ, జి.నారాయణరావు, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్ఏఎస్ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఆర్.శివకుమారి, కార్యవర్గ సభ్యులుగా రమణమ్మ ఎన్నికయ్యారు. ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు డీవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో ఏపీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి ఎ.సురేష్, పట్టణ అధ్యక్షుడు వై.ఆనంద్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.తవుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



నవోదయ ప్రవేశ పరీక్ష పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్

శంగవరపుకోట: నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు కిల్తంపాలెం జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు. 9, 11 తరగతుల్లో ఉన్న ఖాళీలు భర్తీ చేసేందుకు నిర్వహిస్తున్న ఎల్.ఇ.ఎస్.టి–2025 పరీక్ష ఐదు కేంద్రాల్లో నిర్వహించారు. 9వ తరగతి అభ్యర్థులకు ఎస్.కోట మండల కేంద్రంలో నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 1021 మంది హాజరు కావాల్సి ఉండగా 684 మంది హాజరయ్యారు. 11వ తరగతి అభ్యర్థులకు నవోదయ విద్యాలయంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. 11వ తరగతిలో ప్రవేశానికి 565 మంది దరఖాస్తు చేయగా 317మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

'కళా'కు కోడ్ వర్తించదా..!

- అమ్మవారి జాతర కరపత్రాలు విడుదల చేసిన ఎమ్మెల్యే వెంకటరావు



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

చీపురుపల్లి:

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వం తరఫున జరిగే ఎలాంటి కార్యక్రమాల్లోనూ, ప్రారంభోత్సవాల్లోనూ ప్రజాప్రతినిధులు పాల్గొనరాదని కోడ్ నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎంతో సీనియారిటీ ఉన్న స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కోడ్ ఉల్లంఘించారనే చర్చ పట్టణంలో జరుగుతోంది. శనివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర తేదీలు వెల్లడిస్తూ, కరపత్రాలు విడుదల చేయడం కోడ్ ఉల్లంఘనలోకి వస్తుందని రాజకీయ పార్టీల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వమే జాతర నిర్వహిస్తుందని సాక్షాత్తూ ఎమ్మెల్యే వెల్లడించడం కోడ్ ఉల్లంఘనే కదా? అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలని పలువురు చర్చించుకుంటున్నారు. కోడ్ అమల్లో ఉండడంతోనే కరపత్రాలు విడుదలకు దేవదాయశాఖ అధికారులు కూడా హాజరవ్వలేదని తెలుస్తోంది. కోడ్ అమల్లో ఉండడంతోనే జాతరకు ఉత్సవ కమిటీను కూడా నియమించలేదు. కరపత్రాలు విడుదల సమయంలో దేవదాయశాఖ అధికారులు లేకపోవడాన్ని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా కోడ్ అమల్లో ఉండడంతోనే హాజరవ్వలేకపోయానని తెలిపారు.

జాతర తేదీలు వెల్లడించిన ఎమ్మెల్యే

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను మార్చి 2, 3, 4 తేదీల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు వెల్లడించారు. శనివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో అమ్మవారి జాతర కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఏటా జరుగుతున్న సాంప్రదాయంలో భాగంగానే ఈ ఏడాది కూడా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 27వ వార్షిక జాతర మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. దేవదాయశాఖ, గ్రామ పెద్దలు, భక్తులు నేతృత్వంలో ప్రభుత్వం జాతరను నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. మూడు రోజులు జాతరలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, పైల బలరాం, రెడ్డి గోవింద్, సారేపాక సురేష్, పొట్నూరు త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ

పార్వతీపురం టౌన్: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలను, జీతాల చెల్లింపు ప్రక్రియను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ డిమాండ్ చేశారు. పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో శనివారం జిల్లా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, కంటింజెంట్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా అనేక నిర్ణయాలు చేస్తున్నదని విమర్శించారు. ప్రస్తుతం ఆప్కాస్ పద్ధతిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు జరుపుతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని మార్చి రాష్ట్రంలో ప్రస్తుతం పని చేస్తున్న 2.50 లక్షల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగుల భవితవ్యాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి, వారి ద్వారా కొత్త నియామకాలు, జీతాలు చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం చేసిందన్నారు. ఇదే జరిగితే రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ కంటింజెంట్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సకాలంలో జీతాలు కూడా చెల్లించే పరిస్థితి ఉండదని, పీఎఫ్, ఈఎస్ఐ, కూడా అమలు చేయరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలు రాజకీయ నిరుద్యోగ పునరావస కేంద్రాలుగా మారి ఉద్యోగులకు రాజకీయ వేధింపులు, తొలగింపులు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఉద్యోగులు, కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ కో చైర్మన్ బి.ఈశ్వరరావు, పోలినాయుడు, ఆనందరావు అభిరామ్, గణపతి, విజయనగరం జిల్లా జేఏసీ నాయకులు జి.అప్పలసూరి, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీతో పాటు జాబ్ క్యాలెండర్ విడుదలకు డిమాండ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామన్న

విజయనగరం ఫూల్‌బాగ్: డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించి సకాలంలో పోస్టులు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని గురజాడ గ్రంథాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కూటమి విజయంలో నిరుద్యోగులు కీలక పాత్ర వహించారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ సంతకం చేశారని, నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే డీఎస్సీ ప్రకటించి సకాలంలో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో పట్టుబడిన మహిళ

గజపతినగరం రూరల్: బొండపల్లి మండలంలోని అయ్యన్న అగ్రహారంలో దాడులు నిర్వహించగా తొమ్మిది మద్యం సీసాలతో బత్తుల లక్ష్మి పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు శనివారం తెలిపారు. సంబంధిత మహిళపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐలు పి.నరేంద్రకుమార్, ఎస్.కొండలరావు పాల్గొన్నట్టు చెప్పారు.

పండగెళ్లిపోయింది..
జరగని రోడ్డు పనులు రద్దవుతున్నాయి...!



✏ ఈ చిత్రం చూశారా? ఇది బొబ్బిలి మండలం గోపాలరాయుడిపేట పంచాయతీ కేంద్రంలోని శ్మశానానికి వెళ్లే నడకదారి. దీనికి రోడ్డు వేయాల్సి ఉంది. కానీ పట్టించుకోలేదు. అవసరమున్న రహదారులు కాకుండా పెద్ద అవసరం లేని రహదారులను మాత్రం గుర్తించి వేస్తున్నారు.



✏ ఇక ఈ రోడ్డు పరిస్థితి చూడండి! రామభద్రపురం మండల కేంద్రంలోని పెదపల్లి వీధిలో దాదాపు 200 మీటర్ల రహదారిని నిర్మించేందుకు మంజూరైతే చేశారు. పండగ వెళ్లిపోయింది. ప్రజలూ వెళ్లిపోయారు. కానీ గుంతలు, దుర్గంధం మిగిలిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



✏ కాలువలు మాత్రమే నిర్మించిన ఈ రోడ్డు చింతాడ గ్రామంలోనిది. బిల్లులు రాకపోవడంతో సీసీ రోడ్డు నిర్మించలేదు. ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

- 3 నియోజకవర్గాల్లో 1047 పనులకు రూ.74 కోట్లు మంజూరు
- రూ.22 కోట్ల పనులు చేస్తే రూ.12 కోట్ల చెల్లింపులతో పూర్తి కాని పనులు

బొబ్బిలి: సంక్రాంతి నాటికి రోడ్లు సాపుగా ఉండాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సంతోషంగా గుంతలు లేని రోడ్లపై నడచి, వాహనాలు నడిపి వెళ్లొచ్చని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. సంక్రాంతి వచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి ప్రజలూ వచ్చారు. ఏదో పండగ చేసుకుని వెళ్లిపోయారు. రోడ్లు కూడా అంతే పాత రోడ్లు అలానే ఉన్నాయి. బిల్లులు కాకపోవడంతో అధికారులు పనులను రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. మరెక్కడి పల్లె పండగ? అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రజలకు పండగలోగా ఒక్క గుంత కూడా ఉండకూడదు. చక్కని రోడ్లతో స్వాగతం పలుకుతామన్న కూటమి నాయకుల పనితీరు వట్టిదే.. అని తేలిపోయింది.

జిల్లాలోని బొబ్బిలి, గజపతినగరం, రాజాం నియోజకవర్గాల్లో పల్లె పండగ పేరుతో 1047 పనులు మంజూరు చేసింది కూటమి ప్రభుత్వం.అంతే కాదు... డిప్యూటీ సీఎం నుంచి సీఎం దాకా, జిల్లా మంత్రి నుంచి ఎమ్మెల్యే దాకా ఒకటే బాకా ఊదారు. పల్లెల్లో రోడ్లన్నీ సాపుగా ఉండాలని, ఇతర ప్రాంతాల నుంచి సంక్రాంతి పండగకు వచ్చేవారిని చక్కని రోడ్లతో స్వాగతం పలుకుదాం.. అని.. కట్ చేస్తే పండగ వెళ్లింది. పండగకు వచ్చిన ప్రజలూ వెనక్కి వెళ్లారు. కానీ రోడ్ల గుంతలు మాత్రం అలానే ఉండిపోయాయి. ఇదేనా కూటమి నాయకుల హామీలు అని ప్రజలు ఏవగించుకుంటున్నారు. మూడు నియోజకవర్గాల్లో రూ.74కోట్లతో 1047 పనులు మంజూరు చేస్తే అందులో 495 పనులు చేశారు. ఈ పనుల విలువ రూ.22 కోట్లు. ఇందులో రూ.12 కోట్లు మాత్రమే చెల్లింపులు చేశారు. మిగతా చెల్లింపులు జరగలేదు. దీంతో కాంట్రాక్టర్లు కూడా ఇదిగో.. అదిగో.. అంటున్నారు. పనులు చేస్తాం అంటున్నారే తప్ప పండగెళ్లిపోయింది కదా గాబరా ఎందుకని పనులను ఎక్కడివక్కడ వదిలేశారు.

12నాటికి బిల్లులు అయ్యే అవకాశం

ప్రారంభంలో బిల్లులు బాగానే జమయ్యేవి. ఇప్పుడు బిల్లులు అందడం లేదు. ఈ నెల 12నాటికి బిల్లులు అయ్యే అవకాశం ఉందని ఎదురు చూస్తున్నాం. ప్రారంభించని పనులను రద్దు చేయాలని సిఫార్సు చేశాం. – సీహెచ్‌వి అప్పారావు, డీఈఈ, పంచాయితీ రాజ్, బొబ్బిలి

మరోసారి గడువు పెంచారు

పల్లెపండగ సందర్భంగా సంక్రాంతికల్లా రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేద్దామని అనుకున్న నాయకులు, అధికారులు అది కాస్తా సగం కూడా పూర్తి కాకపోవడంతో గడువు మళ్లీ మార్చారు. ఇప్పుడు నెలాఖరుకల్లా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు గడువు పెంచారు. కానీ అదీ అయ్యేలా లేదు. పనులు జరగాలంటే బిల్లులు కూడా జోరందుకోవాలి. కాంట్రాక్టర్లకు మెటీరియల్ కొనుగోలు చేసుకునేందుకు అవకాశమివ్వాలి. కానీ గడువు ఇచ్చేది ప్రచారం కోసమని ప్రజలకు తెలియదు కదానని పలువురు గుసగుసలాడుకుంటున్నారు.